# కృష్ణప్రియ ఆ ఆఫీసులో టైపిస్టుగా చేరి ఆ రోజుకి ఎనిమిది నెలల పదిహేను రోజు లవుతుంది.

**ముందురోజే పర్మిషన్ తీసుకోవడంవల్ల కృష్ణప్రియ ఆలస్యంగావచ్చింది ఆఫీసుకి. పదకొండున్నరకి ఆఫీసుముందు రిక్షాదిగి, రిక్షావాడికి చిల్లరయిచ్చి ఆఫీసులోకి అడుగుపెట్టింది.**

రోజూలాగే ఎకౌంటెంట్ మోహన్ రావ్ విష్‌చేశాడు కృష్ణప్రియని.

"గుడ్ మార్నింగ్ మిస్ కృష్ణప్రియ."

"గుడ్ మార్నింగ్."

తన సీట్‌లో కూర్చుని డ్రాయర్ తెరచి కాగితాలు బయటకి తీసింది వెంటనే పనిలో మునిగిపోయింది.

లంచ్ అవర్‌లో మోహన్ రావ్ కృష్ణప్రియ దగ్గరకివచ్చి అడిగాడు అలవాటుగా.

"ఇవాళేం తెచ్చారు?"

"ఉప్మా"

టిఫిన్ బాక్స్‌ని కుర్చీకి వేలాడుతున్న ఆమె హేండ్ బ్యాగ్ లోంచి చనువుగా తీసుకున్నాడు మోహన్ రావ్.

కృష్ణప్రియ టైప్ చేస్తున్న కాగితం పూర్తయే దాకా ఆగాడు ఓ తెలుగు వారపత్రిక తిరగేస్తూ. కృష్ణప్రియ లేచాక ఇద్దరూ లంచ్ రూంలోకి వెళ్ళారు.

"షుగర్ బేబి, ఆలస్యం అయిందే?" అడిగాడు మోహన్ రావ్.

"పని మీద వెళ్ళాను."

టిఫిన్ బాక్స్ తెరచి స్టీల్‌మూతలో చెంచాతో కొంత ఉప్మా వేసుకున్నాడు

"ఇవాళ నంచుకోడానికి పచ్చడి తేలేదు" చెప్పింది కృష్ణప్రియ మరికాస్త అతని మూతలో వేసి.

"రేపు మధ్యాహ్నం డెడ్‌లైన్. ఆలోచిస్తున్నారా ఆ సంగతి?" అడిగాడు.

కృష్ణప్రియ కొన్నిక్షణాలు మౌనంగ వుండిపోయింది.

"షుగర్ బేబి."

కృష్ణప్రియ నవ్వింది. సమాధానం చెప్పలేదు

"ఆల్ రైట్. రేపటి దాకా నిజానికి అసలా ప్రస్తావన తీసుకురాకూడదు నేను. నాకు తొందర ఎక్కువని షుగర్ బేబికి తెలుసు."

మిగతా స్టాఫ్ కూడా ఒకొక్కరే లంచ్ రూంలోకి రావడంతో, ఆ సంభాషణ మానేసి సినిమాల గురించి మాట్లాడసాగాడు మోహన్ రావ్.

"షుగర్ బేబి" అని ఎవరూ వినకుండా మెల్లగా పిలిచి చెప్పాడు గట్టిగా "కాఫీ తాగొద్దామా?"

"ఉ."

"మాతో కాఫీకి ఎవరొస్తారు?" అడిగాడు మిగతా వాళ్ళని.

"పార్టీనా?" డిస్పాచ్ క్లర్క్ అడిగాడు ఆనందంగా.

"అమెరికన్ సిస్టమ్."

తల అడ్డంగా వూపాడు వెంటనే.

"జల్లు పడుతోంది. రాను." చెప్పాడు డిస్పాచ్ క్లర్క్.

కృష్ణప్రియ టిఫిన్ బాక్స్‌ని కడిగి హేండ్ బేగ్‌లో పడేసింది. పాత బట్టతో దాన్ని శుభ్రంగా తుడిచి.

ఇద్దరూ రెండు నిముషాల్లో చిన్న కాఫీ హోటల్లోకి వెళ్ళారు.

"సరిగ్గా వారం క్రితం ఇక్కడే అడిగాను గుర్తుందా షుగర్ బేబి?" అడిగాడు మోహన్ రావ్ కాఫీ తాగుతూ

కృష్ణప్రియ నవ్వింది. జవాబు చెప్పలేదు.

* * *

కృష్ణప్రియ ఆఫీసులో చేరిన వారం రోజుల్లోనే మోహన్ రావ్ అందరికన్నా ఆమెతో ఎక్కువగా మాట్లాడసాగాడు. పదిహేను రోజుల తర్వాత కృష్ణప్రియ ఆఫీసులోకి రాగానే 'గుడ్ మార్నింగ్ మిస్ కృష్ణప్రియ' అని విష్ చేయడం ప్రారంభించాడు.

తనసంగతి తెలిసే తన పేరుముందు కావాలని 'మిస్' చేరుస్తున్నాడని తెలుసు కృష్ణప్రియకి.

నెల తర్వాత "షుగర్ బేబి- ఈ రోజు నుంచి మీ టిఫిన్‌లో నేను కూడా భాగం పంచుకుంటాను" అన్నాడు.

రోజూ లంచ్‌లో కృష్ణప్రియ తెచ్చుకునే టిఫిన్ తనుకూడా తినసాగాడు

"మీరు టిఫిన్‌లు అద్భుతంగా చేస్తారు షుగర్ బేబి" అనేకసార్లు పొగిడాడు.

పొగిడినప్పుడల్లా తన మాజీ భర్త మాటలు గుర్తుకు వచ్చేవి. అవే ఆయన ఆఖరుసారి మాట్లాడిన మాటలు.

"కృష్ణా. ఈ రోజు నుంచి ఎవరి జీవితాలు వాళ్ళవి. నీ గురించి గుర్తు పెట్టుకోవాల్సిన మంచి విషయాలలో నీ చేతి వంట మొదటిది."

"ఇంకా?" అడిగింది.

జవాబుగా చిరునవ్వు నవ్వి సిటీ సివిల్ కోర్టు కారిడార్‌లోంచి గబగబా బయటకి వెళ్ళిపోయాడు. కృష్ణప్రియకి మొదటిసారిగా జీవితంలో తను ఎంతో ఎంతో ఎంతో ఒంటరిదయిపోయిందనిపించింది ఆ క్షణం.

"షుగర్ బేబి- ఏమిటా పరధ్యానం?" తనని ఎన్నటికీ వదలవా అనిపించే అలాంటి ఆలోచనలలో మునిగిపోతే పలకరించేవాడు మోహన్ రావ్.


జవాబుగా నవ్వేది.

"నవ్వినప్పుడు మీరు నిజంగా షుగర్ బేబీనే." అనేవాడు మోహన్ రావ్.

క్రమంగా మోహన్ రావ్‌కి తనంటే ఎంతో ఇష్టం అని గ్రహించింది కృష్ణప్రియ తనతో అతను ఎంత చనువుగా మాట్లాడినా ఆఫీస్‌లో గుసగుసలలాంటివి లేవు. మోహన్ రావ్ తత్వమే అంతని అందరికీ తెలుసు. కాని కృష్ణప్రియని 'షుగర్ బేబి'గా పిలుస్తున్నాడన్న సంగతి మాత్రం ఎవరికీ తెలియదు. రహస్యంగా వుంచాడు మోహన్ రావ్ ఆ సంగతి.

# షుగర్ బేబీ

మల్లాది వెంకట కృష్ణమూర్తి



అయిదు నెలల క్రితం మోహన్‌రావ్ అడిగాడు కృష్ణప్రియని

"సినిమా కెళదాం ఇవాళ."

"అ యామ్ సారీ. రాను."

"ఇవాళ నా పుట్టిన రోజు మేడమ్."

"........"

"రారా?"

"ఊహు."

మోహన్‌రావ్‌ని అడిగింది కృష్ణప్రియ-మరో రెండు నెలల తర్వాత.

"సినిమాకి వెళదామా?"

మోహన్‌రావ్ రోజూ కనబడి మాట్లాడుతుండటంతో. అతనితో యేర్పడ్డ సాన్నిహిత్యంతో, ఆ హోటలో వంటరిగా అతని పక్కన కూర్చోవడం. అతని పక్కన చీకట్లో కూర్చుని మూడుగంటలసేపు రకరకాల ప్రణయ దృశ్యాలుగల ఇంగ్లీష్ సినిమా చూడటం తప్పుగా తోచలేదు కృష్ణప్రియకి.

సినిమా విడిచాక మోహన్‌రావ్ కృష్ణప్రియ చేతిని పట్టుకుని బయటకి నడిచాడు.

తర్వాత కృష్ణప్రియ అతనితో చాలా సార్లు సినిమాలకి, హోటళ్ళకి, పబ్లిక్ గార్డెన్‌కి వెళ్ళింది. ఇంటికి తీసుకువెళ్ళి పెద్దన్నకి, వదినకి, చెల్లెలుకి పరిచయం చేసింది

అన్నయ్యకి అభ్యంతరం అనిపించలేదు కాని వదిన మాత్రం నిష్కర్షగా చెప్పింది.

"మొగ స్నేహితులను ఇంటికి తీసుకు రావటం నాకు నచ్చదు. పెళ్ళి కావల్సిన ఆడపిల్లలున్నారు నాకు విన్ను చూసి వాళ్ళు నేర్చుకుంటారు."

కృష్ణప్రియ అహం దెబ్బతింది. ఇద్దరి మధ్యా స్నేహం విపరీతంగా పెరగడంతో అలా తీసుకురావడం తప్పుగా తోచలేదు. ఏడు నెలల క్రితం తీసుకువస్తే ఎలామాట్లాడేదో వదిన అలాగే మాట్లాడింది ఆ తర్వా... కూడా- ఆ సంగతి గ్రహి...

"ఓ సారి జీవితంలో ... తిన్నా... జాగ్రత్త ... హెచ్చ...

"అంటే ని వుద్దేశం ... తిరుగుబోతునవా?" అడిగింది కృష్ణప్రియ వుక్రోషంగా.

"లోకం దృష్టిలో అంతే అవుతావు. ఆటోల్లో సినిమాలకి అతనితో తిరిగే 'తిరుగుబోతువు' అవుతావు ఆ మాట నువ్వు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా."

ఇద్దరి మధ్యా ఘర్షణ పెరిగింది వారం రోజుల్లో కృష్ణప్రియ, ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చిన బలంతో. ఓ గది చూసుకొని దాంట్లోకి మారింది.

విడాకులు తీసుకున్న తన భర్త పంపిన శుభలేఖ చూశాక. శుభలేఖలో ప్రచురించిన కాబోయే ఆయన భార్య ఫొటో చూశాక అసూయతో భగ్గుమంది మనసు.

"మోహన్‌గారూ మనసేం బాగాలేదు. ఇవాళ సినిమాకి వెళదాం" అడిగింది రెండు వారాల క్రితం.

"ఏమైంది? మీ వదిన మళ్ళా...."

"కాదు."

వెడ్డింగ్ కార్డ్ చూపించింది.

"షుగర్ బేబి. ఎందుకిలా ఫీల్ అవుతారు? మీరూ పెళ్ళి చేసుకో వచ్చుగా?"

"పెళ్ళా?"

అంతదాకా మళ్ళీ తన పెళ్ళి గురించి సీరియస్‌గా ఆలోచించలేదు.

"అవును. పెళ్ళి కాక పోతే వివాహం. లేదా పరిణయం. లేదా మేరేజ్... షాదీ."

"లోకం హర్షిస్తుందా?"

చాలాసేపు ఆ విషయం చర్చించారు.

వారం క్రితం అడిగాడు మోహన్‌రావ్

షుగర్ బేబీ ఓటడగనా?"

"అడగండి."

"నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను."

"ఐ.... ఐ యామ్ సారీ. ఇంకా ను...."

"ఆలోచించండి. ఇప్పుడే చెప్పక్కర్లే

# పెదాల చితిలో పదాల మంటలు!

ప్రాములా పాక్కుంటూ వచ్చి
ప్రశ్నార్థకంలా
పడగ విప్పింది ఏకాంతం
విప్పిన డేగరెక్కల్లోంచి
అంతర్ధాన మవుతూంది ఆకాశం
మేఘాల శవాల్ని
మౌనంగా మోపుకు వెడుతూన్న
గాలి

ఏ వండుటాకు కుత్తుకనో
మెత్తగా కత్తిరిస్తుంది
గోళ్ళు తెగిపోయిన వేళ్ళనో
వదును మాటు కుంటున్న
ఒక బాధా పారవశ్యం
వలయాలు వలయాలై
రహస్యాల్లోకి తాకెక్కిళ్ళ
నన్నొక నిశ్శబ్దాన్ని చేస్తుంది
ఆది నా పాట—

కాలం కళ్ళు తెరవక ముందు
లోకం కదలని ఒక ఊహా లోలకం
తప్ప. గుప్పెడు గుండెకాయ లాంటి
దిగులు నిండిన శూన్యం తప్ప. అంతా
అనంత అంధకారం తప్ప. మరేం
కాక ముందు. ఎక్కడా ఏమీ లేకముందు
—హృదయమై స్పందించిన నా పాట
మనిషి అని మారోమ్రగి. దిక్కుల్లోంచి
దద్దరిల్లి పరితపించిన నా పాట
అస్తిత్వ తీవ్రతలో ఆకారంకోసం
అలమటించిన నా పాట

కరిగి కరిగి పరమాణువై
పంచ భూతాల గర్భపీఠంలో
పగిలి ప్రళయమై రేగి
అల్లకల్లోలమై. సుళ్ళు.
సుడి గుండాలై చెలగి చెలరేగి
లోయ ల్లోయలుగా
శిఖరాలు శిఖరాలుగా
అడవులు బీళ్ళు మైదానాలుగా
నదులు సెలయేళ్ళు సముద్రాలుగా
తోటలు. తూనీగలు. వసంతాలుగా
బ్రహ్మండ గోళాలుగాసాగి సంభించి. ఆగి
ప్రజల్తోపాటు పరవళ్ళు తొక్కుతూ
ప్రపంచమై పరవశించిన నా పాట.
మట్టితోపుట్టి. మట్టితోపెరిగి
మట్టే సర్వస్వమయి. మనిషి మస్తిష్కంలో
స్వేచ్ఛా సౌందర్యమై శోభించిన నా పాట
ఊపిరి వటవృక్షానికి కాసిన
వెచ్చటి గుండెకాయలాంటి నా పాట
అన్యాయమై. ఆకలీ కన్నీళ్ళ చిలికి
నల్లని వగుళ్ళనించి.
నాదాల నెరదల్నించి
నెత్తుటి మెతదనంలా
ఆవేదనలా. ఆర్తనాదంలా
నలిగి. నలుపెక్కిన ఆత్మ రావంలా
వినిపిస్తూన్న నా పాట
పేర్చిన నా పెదాల చితిమీంచి
వచ్చటి మంటలా వెలుగుతుంది.

—ఖాదర్ మొహియుద్దీన్

వారంరోజులు టైం తీసుకోండి. మళ్ళీ గురువారం యిదే రోజుకు నిర్ణయం తెలియ చేయండి."

"....   ....   ...."

"ఏమిటి ?"

"అలాగే."

"షుగర్ బేబి. జాగ్రత్తగా అన్ని కోణాలలోంచి ఆలోచించండి."

ఆ వారం రోజులూ మోహన్‌రావ్ కృష్ణప్రియకి మరింత దగ్గరవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"మీకు విడాకులిచ్చిన మీ ఆయనకు సెన్స్ లేదని నా అనుమానం అసలు నన్నడిగితే ఆయన...."

"ప్లీజ్. ఇంకెప్పుడూ అలా మాట్లాడకండి."

"ఓ. ఆ యామ్ సారీ. మీరు ఎంత ఎలిజిబుల్ వైఫ్‌గా వుండగలరో చెప్పాలనే నా తాపత్రయం."

వారం నించీ ఆలోచిస్తూనే వుంది కృష్ణప్రియ మోహన్‌రావ్ మంచివాడు. ఇద్దరు చెల్లెళ్ళు తప్ప. మరే బాధ్యతలూ లేవు

నాలుగు రోజుల్రక్రితం అడిగింది.

"మీఇంటికి తీసుకువెళ్ళి మీఅమ్మగారికి. చెల్లెళ్ళకి పరిచయం చేయరా నన్ను ?"

మోహన్‌రావ్ తడబడ్డాడు వెంటనే.

"ఇప్పుడు కాదు. మీనిర్ణయం చెప్పాక"

"నాకు ఈలోగా వాళ్ళని చూడాలని వుంది."

"సారీ షుగర్‌బేబి ...."

"చెప్పండి నిర్భయంగా."

"మా అమ్మ ఛాందసురాలు మిమ్మల్ని తీసుకెళితే ఆవిడ ఏమయినా అనుకుంటుంది.... ఐ మీన్...."

"అర్థమైంది."

కృష్ణప్రియకి అనిపించింది వెంటనే- ఆడ పిల్లయి వుండి తను మోహన్‌రావ్ విషయంలో వదినతో పోట్లాడి బయటకి వచ్చేసింది.

మొగాడయి వుండి మరి మోహన్‌రావ్ !

*   *   *

"చెప్పండి."

గురువారం నాడు ఆత్రంగా అడిగాడు మోహన్‌రావ్ లంచ్ అవర్‌లో హోటల్‌లో.

"ఒకటి రెండు విషయాలు సూటిగా అడుగుతాను జవాబు చెప్తారా ?"

"షూర్ షుగర్‌బేబి."

"మీకు తెలుసు నేను డైవోర్సీనని. అంటే కన్యకాదు. రెండుసార్లు అబార్షన్లు కూడా అయాయి. నాకు తెలిసినంతమటుకు మగవాళ్ళు పెళ్ళికాని. కన్య అయిన ఆడపిల్లలనే కోరుకుంటారు. మీరెందుకు నన్ను చేసుకోవాలనుకుంటున్నారు ?"

"ఐ లవ్ యు."

ఆ మాట మొదటిసారి అదే రోజు చెప్పాడు మోహన్‌రావ్.

కృష్ణప్రియ మనసు ఆనందంతో పురకలు వేసింది.

ఐ లవ్ యు !

"నేనంటే మీ కిష్టంలేదా షుగర్‌బేబి !"

"ఐ లవ్ యు టూ" చెప్పింది కృష్ణప్రియ సిగ్గుతో తలవంచుకుని.

మొదటిసారి పెళ్ళి చూపుల రోజు అలాగే సిగ్గుపడ్డ సంగతి గుర్తుకు వచ్చింది కృష్ణప్రియకి.

"అంటే మన పెళ్ళికి మీరు ఒప్పుకున్నట్లేనా ?"

"ఊఁ"

"స్పష్టంగా చెప్పండి" నవ్వాడు మోహన్‌రావ్ సంతోషంగా.

"ఇష్టమే."

"ఏమిటి ఇష్టం ?"

"అదే."


"ఏది ?"

"మిమ్మల్ని షుగర్ బేబి పెళ్ళి చేసుకోవడం."

కృష్ణప్రియ చేతిని ఆప్యాయంగా అందుకుని చెప్పాడు మోహన్‌రావ్.

"మీ వంట తరచు కాకుండా రోజూ తినే అవకాశం వస్తుందన్నమాట."

"పెళ్ళయాక నేను వుద్యోగం మానేయాలనుకుంటున్నాను."




వెంటనే మోహన్ రావ్ చేతిని వెనక్కి తీసుకున్నాడు. తలయెత్తి చూసింది. అతని మొహంలో నవ్వు క్షణకాలం మాయమయింది.

"ఉద్యోగం మానేస్తారా ?" అడిగాడు ఆశ్చర్యంగా.

"అవును. తప్పదుకాబట్టి చేస్తున్నాను. నా కిష్టంలేదు."

"వద్దు. నా కిష్టం వుండదు అలా."

"ఏం ?"

"ఉహూ. నా భార్య వుద్యోగం చేయాలి."

మోహన్ రావ్‌లో తను ఇంతదాకా చూడని మరో మోహన్ రావ్ కనబడ్డాడు కృష్ణప్రియకి

ఇద్దరూ లేచారు.

మోహన్ రావ్‌కి తను కాదు నచ్చింది. ఒకరి చేతిలో కొన్ని సంవత్సరాలు నలిగిన తనని, మరో మొగాడితో కొన్ని సంవత్సరాలు ఒకే ఇంట్లో వుండి అతని బట్టలుతికి, భోజనం వండి పెట్టి, అతని ఎంగిలి కంచం కడిగి, అతనికి సపర్యలు చేసిన తను మోహన్ రావ్‌కి నచ్చదు.

కాదు. తను కాదు.

తన జీతం.

తన సంపాదన నచ్చింది.

నెల నెలా తను తెచ్చే అయిదు వందల రూపాయలు నచ్చాయి మోహన్ రావ్‌కి. అందుకే తనని చేసుకోవడానికి అతని మనసు సమ్మతించింది.

ఆ అయిదు వందలకోసం తన గత జీవితం మర్చిపోవడానికి సిద్ధపడ్డాడు- ఆ జీతంతో చెల్లెళ్ళ పెళ్ళి చేయొచ్చు. టి. వి. కొనచ్చు. రెఫ్రిజిరేటర్ కొనచ్చు. స్థలం కొనచ్చు. ఇల్లు కట్టచ్చు. తను రిటైరయ్యే లోపల ఎన్నో చేయచ్చు.

వాటికోసం తన గతం విస్మరించడానికి సిద్ధపడ్డాడు. తనమీద ఆధారపడ్డ వాళ్ళు ఎవరూ లేరని తెలిసి.

ఈ ఉద్యోగం లేకపోతే తనని "షుగర్ బేబి" అనగలిగేవాడా ? పెళ్ళి చేసుకుంటానని అనగలిగేవాడా ! తను వుట్టి బేబీనే. తన సంపాదనే తనని "షుగర్ బేబి" ని చేసింది.

మోహన్ రావ్ యింతకాలం "తనలో" తీపిని చూస్తున్నాడనుకుంది కాని, తన "సంపాదనలో" అనుకోలేదు.

డబ్బు తీసుకుని శరీర సుఖం యిచ్చే వేశ్యకి మోహన్ రావ్‌కి తేడాఏమిటి ?

నిజానికి లేదు- కాని, చాలా వుంది.

డైవార్స్‌ని చేసుకొన్నందుకు అతన్ని అభినందిస్తారు చాలా మంది- వెనకాల 'సెకండ్ హేండ్‌ని' కట్టుకున్నాడని నవ్వుకున్నా.

డబ్బు కోసం చేసుకున్నాడని తెలిసినా వేశ్యలా మోహన్ రావ్‌ని నీచంగా చూడరు.

ఆ రాత్రంతా ఆలోచిస్తూనే వుంది. తెల్లవారు తూండగా ఓ నిర్ణయానికి వచ్చింది.

మర్నాడు లంచ్ అవర్‌లో హోటల్‌లో అడిగాడు మోహన్ రావ్.

"షుగర్ బేబి. ఉద్యోగం గురించి ఏం ఆలోచించారు ?"

"మీరు ?"

"నిన్నే చెప్పాగా ?"

"ఆట్టే ఆడంబరాలు లేకుండా రిజిష్టర్ మేరేజ్ చేసుకుందాం" చెప్పింది కృష్ణప్రియ.

"థాంక్స్... థాంక్స్ ఎలాట్ "

కృష్ణప్రియకి తెలుసు తనకి వివాహం కావాలనుకుంటే సంపాదన ఒక్కటే తగిన క్వాలిఫికేషన్ అని.

అనేకమంది షుగర్‌బేబీలలాగా కృష్ణప్రియ కూడా వివాహం లేకుండా వంటరిగా బ్రతకదలచుకోలేదు.

"చిన్న రిక్వెస్ట్." అడిగింది.

"చెప్పు. మిమ్మల్ని ఇకనుంచి నువ్వు అనాలా ? ఓ కె షుగర్ బేబీ."

"కాదు."

"మరేమిటి ?"

"ఇంకెప్పుడూ నన్ను పొరపాటున కూడా 'షుగర్ బేబి' అని పిలవద్దు" చెప్పింది షుగర్ బేబి.

